సాక్షి తిరుపతి

సోమవారం । 18 । డిసెంబర్ । 2023



కదం తొక్కుతూ..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారం చేపట్టాలని కోరుతూ పలువురు నేతలు పాదయాత్ర చేపట్టారు. - 8లో



ప్రజా శ్రేయస్సే పరమావధిగా..

ప్రజా శ్రేయస్సే పరమావధిగా జగనన్న పాలన సాగిస్తున్నారని తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి తెలిపారు. - 8లో



కబడ్డీ విజేత పుంగనూరు

ఉమ్మడి జిల్లా కబడ్డీ టోర్నీలో పుంగనూరు జట్టు విజేతగా నిలిచింది. తిరుపతి జట్టు రెండో స్థానం దక్కించుకుంది. - 8లో

న్యూస్‌రీల్

గొబ్బి దేవతకు ప్రత్యేక పూజలు



ఊరేగుతున్న గొబ్బి దేవత

శ్రీకాళహస్తి: ధనుర్మాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో గొబ్బి దేవతకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అలంకార మండపంలో దేవతను కొలువుదీర్చారు. విశేషాభిషేకం జరిపించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనతంరం వేదమంత్రోచ్చరణలు, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారిని చప్పరంపై అధిష్టింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ కేవీఎస్ రామారావు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అర్జీలు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. స్పందనకు అన్నిశాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు నారాయణగిరి ఉద్యానవనం వరకు బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి వరకు 59,734 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,654 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.52 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

గ్రూప్-2 మాక్ టెస్ట్‌కు 150 మంది



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

తిరుపతి సిటీ: ఏపీపీఎస్సీ ఇటీవల గ్రూప్-2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆదివారం ఈ మేరకు పరీక్షకు ప్రిపేరవుతున్న అభ్యర్థులకు ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఉమామహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాక్ టెస్ట్ నిర్వహించారు. సుమారు 150మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారయ్యారు.

గ్రూపు-2 ప్రిలిమినరీకి ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్ : ఏపీపీఎస్సీ గ్రూప్-2 రిక్రూట్‌మెంట్ ప్రిలిమినరీ పరీక్ష కోసం ఉమ్మడి జిల్లాకు చెందిన పేదల అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి బి.భాస్కర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 27 నుంచి 50 రోజులపాటు ఉచిత శిక్షణతోపాటు స్టయిఫండ్, స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు వెల్లడించారు. డిగ్రీలో మార్కుల మెరిట్ జాబితా ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఎంపికైన వారికి తిరుపతి ఎమ్మార్‌పల్లె బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వివరించారు. దరఖాస్తులను తిరుపతిలోని ఏపీబీసీ స్టడీ సర్కిల్ ఫర్ బీసీఎస్, డోర్ నంబర్ 4-171-2లో సమర్పించాలని సూచించారు. వివరాలకు 9441456039, 9985022254, 9346221553 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

హాకీ సంఘానికి కొత్త కార్యవర్గం



నూతన కార్యవర్గం

గూడూరురూరల్ : పట్టణంలోని జీఎంయూపీ స్కూల్ ఆవరణలో ఆదివారం జిల్లా హాకీ సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.స్పర్జన్‌రాజ్, కార్యదర్శిగా బి.ఆదిత్య, కోశాధికారిగా పి.అబ్రహాంకుమార్, ఉపాధ్యక్షులుగా లవ్‌కుమార్, గోపీనాథ్, సంయుక్త కార్యదర్శులుగా యుగంధర్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం, కార్యవర్గ సభ్యులుగా చంద్రోశేఖర్‌రెడ్డి, ఎస్.కె.నజమా, భార్గవి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా పి.రమేష్‌కుమార్, థామస్ పీటర్, దీపక్ ఆకాష్ వ్యవహరించారు.

ప్రగతి రథం.. పథం



శ్రీనివాస బస్టాండ్



తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న ఆర్టీసీ అధికారులు (ఫైల్)

తిరునగరి ఖ్యాతి ఇనుమడించేలా ఆర్టీసీ సేవలందిస్తోంది. ఆధ్యాత్మిక క్షేత్రానికి నిత్యం పెద్దసంఖ్యలో తరలివచ్చే యాత్రికులు ఇబ్బంది పడకుండా రవాణా సౌకర్యం కల్పిస్తోంది. ఈ మేరకు తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో విప్లవాత్మకమార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రయాణికులకు అత్యుత్తమ వసతులను అందుబాటులోకి తీసుకువచ్చింది. అవసరాలకు తగ్గట్టు పలు ప్రాంతాలకు వేలాది బస్సులు నడుపుతోంది. ఈ క్రమంలోనే వినూత్న విధానాలతో ఇబ్బడిముబ్బడిగా రాబడి పెంచుకుంటోంది. అధిక ఆదాయం ఆర్జిస్తూ రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపుతోంది.

అభివృద్ధి దిశగా తిరుపతి ఆర్టీసీ అడుగులు

- సెంట్రల్ బస్టాండ్‌లో విప్లవాత్మక మార్పులు
- మూడు రాష్ట్రాల్లోని ముఖ్య ప్రాంతాలకు బస్సులు
- ప్రయాణికులకు అత్యుత్తమ సౌకర్యాలు
- నిత్యం 3వేలకు పైగా సర్వీసుల రాకపోకలు

తిరుపతి అర్బన్ : ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుపతి-తిరుమలకు దేశవిదేశాల నుంచి నిత్యం లక్షలాది మంది భక్తులు వచ్చి వెళుతుంటారు. ఈ క్రమంలో తిరునగరిలోని సెంట్రల్ బస్టాండ్‌పై ఆర్టీసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గత నాలుగున్నరేళ్లలో ప్రయాణికులు ఎక్కడా లేని విధంగా సకల వసతులు కల్పించారు. ఇదే క్రమంలో ఆర్టీసీ రాబడిని పెంచుకునేందుకు పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తున్నారు. అందులో భాగంగా రాష్ట్రంలోని ముఖ్యమైన నగరాలు, పట్టణాలకే కాకుండా తమిళనాడు, కర్ణాటక , తెలంగాణలోని ప్రధాన ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నారు. దీంతో తిరుపతి జిల్లాలో ఆర్టీసీ ఆదాయం గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం రోజూ సుమారు రూ.1.60 కోట్లకు పైగా రాబడి వస్తోంది. తిరుపతి ఆర్టీసీ అధికారుల ముందుచూపుతో 2021-22లో రూ.526 కోట్లు, 2022-23లో రూ.578 కోట్లతో జిల్లా రెండు పర్యాయాలు రాష్ట్రంలో ప్రథమ స్థానం దక్కించుకుంది. ఈ ఏడాది కూడా రూ.600 కోట్లతో తొలిస్థానంలో నిలిచేందుకు పోటీపడుతోంది.

అదనపు రిజర్వేషన్ కౌంటర్లు

తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పరిధిలోని శ్రీహరి బస్టాండ్‌లో మాత్రమే గతంలో రిజర్వేషన్ కౌంటర్ ఉండేది. దీంతో ప్రయాణికులు ఎక్కువ సమయం క్యూలైన్‌లో ఉండాల్సి వచ్చేది. దీంతో శ్రీనివాస బస్టాండ్‌లో మూడు నెలల క్రితం మరో రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేశారు.

దుకాణాల ద్వారా ఆదాయం

తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో మొత్తం 140 దుకాణాలున్నాయి. నెలకు రూ.75 లక్షలు అద్దె రావాల్సి ఉంది. అయితే గతంలో 50 శాతం దుకాణాలు ఖాళీగా ఉండేవి. ఏడాదికి ఒక్కసారి మాత్రమే ఖాళీ దుకాణాలకు టెండర్లు నిర్వహించేవారు. దీంతో 70 దుకాణాలు ఎప్పుడు ఖాళీగా కనిపించేవి. దీంతో కేవలం రూ.30 నుంచి రూ.40లక్షల ఆదాయం మాత్రమే వచ్చేది. అయితే అధికారులు ప్రస్తుతం ఖాళీ దుకాణాలకు ప్రతి నెలా టెండర్లు ఆహ్వానించే పద్ధతికి శ్రీకారం చుట్టారు. దీంతో నెల వారీ ఆదాయం రూ.80లక్షలకు చేరుకుంది.

ప్రయాణికులకు పకడ్బందీ వసతులు

తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం గతంలో 12 చోట్ల తాగునీటి కొళాయిలు ఉండేవి. ప్రస్తుతం 18 చోట్ల కొళాయిలు ఏర్పాటు చేశారు. గతంలో సాధారణ వాటర్ ఉండేది. ఇప్పుడు ఆర్‌ఓ ప్లాంటు ద్వారా పరిశుద్ధ జలం అందిస్తున్నారు. బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు గతంలో 330 కుర్చీలు ఉండేవి. ప్రస్తుతం 420 కుర్చీలను ఏర్పాటు చేశారు. గతంలో మూత పడిన రెండు స్కూటర్ స్టాండ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇది వరకు మరుగుదొడ్లు నాలుగుచోట్ల ఉండేవి. ప్రస్తుతం 6 చోట్ల ఏర్పాటు చేశారు.గతంలో ఫ్యాన్లు 280 ఉండేవి. ప్రస్తుతం 330 ఫ్యాన్లు అందుబాటులోకి తీసుకువచ్చారు. సీసీ కెమెరాలను పెంచడమే కాకుండా సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు చేపట్టారు. బస్టాండ్‌లోని షాపుల్లో ఎమ్మార్పీ ధరలకే సరుకులు విక్రయించేలా పక్కాగా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ప్రతి నెలా దాదాపు నాలుగు పర్యాయాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్న వారికి అపరాధ రుసుం విధిస్తూ అందరినీ దారిలోకి తీసుకువచ్చారు. హోటళ్లలో నాణ్యమైన భోజనం విక్రయించేలా చర్యలు చేపట్టారు.




బస్టాండ్‌లోని మరుగుదొడ్లు



కార్గో సెంటర్‌లో ఏర్పాటు చేసిన అదనపు కౌంటర్

కార్గో డోర్‌డెలివరీ

తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పరిధిలోని శ్రీహరి బస్టాండ్‌లోని కార్గో సెంటర్‌లో ఇదివరు రెండు కౌంటర్లు మాత్రమే ఉండేవి. అయితే కస్టమర్ల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని మరో కౌంటర్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే కార్గో సరుకుల డోర్ డెలివరీని అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో ఆర్టీసీకి కార్గో మరో ఆదాయ వనరుగా మారింది.



మెరుగైన సౌకర్యాలు

తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. ముఖ్యమంగా మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఇది వరకు ప్రయాణికుల నుంచి నెలకు 100 ఫిర్యాదులు వచ్చేవి. ప్రస్తుతం నెలకు ఒకటి రెండు మినహా ఫిర్యాదులు రావడంలేదు. మరుగుదొడ్లు, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఈ మేరకు నిత్యం పర్యవేక్షిస్తున్నాం.

– రామచంద్రనాయుడు, ఏటీఎం, తిరుపతి బస్టాండ్



సమష్టిగా కృషి

తిరుపతి ఆర్టీసీని సమష్టిగా కృషి చేసి ముందుకు నడిపిస్తున్నాం. రాబడిలో జిల్లాను మరో పర్యాయం ప్రథమ స్థానంలో నిలిపేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం. ఈ ఏడాది రెండు సార్లు బ్రహ్మోత్సవాలకు పక్కాగా రవాణా సౌకర్యం కల్పించాం. తిరుపతితోపాటు జిల్లాలోని 11 డిపోలు సైతం అభివృద్ధి బాటలో ఉన్నాయి. దేశ విదేశాల నుంచి భక్తులు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తున్నాం.

– చెంగల్‌రెడ్డి, ఇన్‌చార్జి ఈడీ, ఆర్టీసీ

చిరస్మరణీయం.. రాయల రాజసం



విగ్రహావిష్కరణలో మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యేలు, బలిజ జేఏసీ నేతలు (ఇన్‌సెట్) హాజరైన జనం

మదనపల్లె : శ్రీ కృష్ణదేవరాయల రాజసం చిరస్మరణీయమని, మంచి పరిపాలనా దక్షుడిగా, నీతికి, నిజాయితీకి మారుపేరుగా, సమైక్యతా భావాలను పెంపొందించిన మహనీయుడిగా అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచి చరిత్రలో నిలిచిపోయారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనియాడారు. బలిజ జేఏసీ మదనపల్లె అధ్యక్షుడు వైఎస్.మునిరత్నం ఆధ్వర్యంలో మండలంలోని బసినికొండ పంచాయతీ పుంగనూరు బైపాస్‌రోడ్డు వై జంక్షన్‌లో ఏర్పాటుచేసిన శ్రీ కృష్ణదేవరాయల కాంస్య విగ్రహాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు నవాజ్‌బాషా, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఆరణిశ్రీనివాసులు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపాశేషు, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ పోకల అశోక్‌కుమార్, కర్ణాటక కైవారం శ్రీక్షేత్ర ధర్మాధికారి ఎం.ఆర్.జయరామయ్య తదితరులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. కొద్దినెలల ముందే పట్టణంలోని మల్లికార్జున సర్కిల్‌లో ఓ విగ్రహాన్ని ఏర్పాటుచేశామని, ఇప్పుడు రెండోది నెలకొల్పడం అభినందనీయమన్నారు. రాయల కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, చంద్రగిరికోట, తిరుపతి రాయలచెరువు ఆయన హయాంలో నిర్మితమై నేడు రైతులకు పూర్తిస్థాయిలో సేవలందిస్తున్నాయని తెలిపారు. బలిజల ఆరాధ్యదైవం శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలను తమ మనోభావాలకు తగ్గట్లుగా ఏర్పాటుచేసుకుంటామని కోరితే ఉచితంగా అందజేస్తామని ఎంపీ మిథున్‌రెడ్డి హామీ ఇచ్చారని వెల్లడించారు. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ..బలిజల కలను నెరవేర్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ప్రభుత్వానికి బలిజలు జీవితాంతం రుణపడి ఉంటారన్నారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ... బలిజలకు అండగా నిలుస్తామన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపాశేషు మాట్లాడుతూ వైజాగ్, తిరుపతి పట్టణాల్లో కాపుభవన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అంతకుముందు బలిజ యువత ఆధ్వర్యంలో పట్టణంలోని నీరుగట్టువారిపల్లె రింగ్‌రోడ్డు నుంచి బసినికొండ వై జంక్షన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. విగ్రహావిష్కరణకు కర్ణాటక, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్యజిల్లాలతో పాటు రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని పుంగనూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల నుంచి పెద్దసంఖ్యలో బలిజకులస్తులు హాజరయ్యారు. డీకే.ఆదికేశవులు నాయుడు కుమార్తె తేజస్విని, రాష్ట్ర యువకాపునాడు అధ్యక్షులు మిద్దింటికిషోర్, అమరనాథ్, జిల్లా యువజనవిభాగం బండ్లలక్ష్మీపతి, సర్పంచ్‌లు ఆనందపార్థసారథి, చిప్పిలిచలపతి, ఆకులగజేంద్ర, డీసీసీ మాజీ అధ్యక్షులు సుధాకర్, బలిజజేఏసీ కమిటీ సభ్యులు రేగడప్రసాద్‌కుమార్, ఎస్.భాస్కర్(మహర్షి), కత్తిలక్ష్మన్న, ఆకులకృష్ణమూర్తి, గుండాలరామచంద్ర, బొంతలజయరాం, జంగాలశివరాం, కూరాకుల ఆంజనేయులు, అండేశివప్రసాద్, రెడ్డిశశికుమార్, మిద్దింటిశంకరనారాయణ, బోర్‌వెల్‌సుధ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి సుప్రభాతం స్థానంలో తిరుప్పావై



తిరుప్పావై పారాయణం చేస్తున్న పండితులు

తిరుమల: ధనుర్మాసం సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం ఉదయం సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదించారు. జనవరి 14వ తేదీ వరకు తిరుప్పావై పారాయణం కొనసాగనుంది. తిరుమల పెద్దజీయర్ మఠంలో తిరుప్పావై పారాయణం ఆదివారం ప్రారంభమైంది. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేసింది. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి పాల్గొని మంగళాశాసనాలు అందించారు. శ్రీవారి ఆలయ పరిచారక కేశ లక్ష్మీనరసింహన్ తిరుప్పావై ప్రవచనం వినిపించారు. మొదటి రోజు రెండు పాశురాలను పారాయణం చేశారు. ఈ సందర్భంగా నాదనీరాజనం వేదికపై గోదాదేవి సంకీర్తనలను ఎస్వీ సంగీత కళాశాల అధ్యాపకురాలు వందన ఆలపించారు. అదేవిధంగా తిరుమల ఆస్థానమండపంలో హైదరాబాద్‌కు చెందిన వేదాంత విద్వాంసులు గోవర్ధనం స్వామినాథాచార్యులు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తిరుప్పావై ప్రవచనాలు వినిపించారు. ఈ కార్యక్రమాల్లో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

తిరుపతి సిటీ : గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆదివారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గవర్నర్ సోమవారం ఉదయం 10.30గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారన్నారు. అనంతరం పద్మావతి అతిథి గృహంలో విశ్రాంతి తీసుకుని మధ్యాహ్నం 3 గంటలకు మహిళా వర్సిటీలో నిర్వహించనున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొంటారని వివరించారు. తదనంతరం తిరుమలకు చేరుకుని రాత్రి అక్కడే బస చేయనున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని, సాయంత్రం రేణిగుంట రైల్వే స్టేషన్ నుంచి దురంతో ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడకు బయలుదేరుతారని వివరించారు. మహిళా వర్సిటీ వీసీ భారతి, కార్పొరేషన్ కమిషనర్ హరిత, అడిషనల్ ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, డీఆర్‌ఓ పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

'పిల్లల పండుగ' పరిపూర్ణం





తిరుపతి నగరంలోని ఎస్‌పీజేఎన్‌ఎం హైస్కూల్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పిల్లల పండుగ ఆదివారంతో పరిపూర్ణమైంది. రోటరీ క్లబ్ సహకారంతో తిరుపతి బాలోత్సవం ఆధ్వర్యంలో చేపట్టిన విశిష్ట కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. జానపద, శాస్త్రీయ కళా నృత్యాలు, ధ్యానం, ఆటలు, పాటలు, కరాటే, బొమ్మల తయారీ, యోగాసనాలు వంటి సుమారు 29 అంశాలలో పిల్లలకు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పోటా పోటీగా ప్రతిభ చాటారు. కళా ప్రదర్శనలు, పోటీలతో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో పండుగ వాతావరణం ఏర్పడింది. ఆదివారం రాత్రి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తిరుపతి బాలోత్సవం కమిటీ ప్రతినిధులు మల్లారపు నాగార్జున, టెంకాయల దామోదరం, నడ్డినారాయణ, గురునాథం, సుంకర రెడ్డెప్ప, మునిరామయ్య, పద్మజ, మునిక్షి, బండి మధుసూదన రెడ్డి, రెడ్డెప్ప, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌కుమార్ రాజు పాల్గొన్నారు.

– తిరుపతి కల్చరల్

పక్కాగా పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కారం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : ప్రత్యేక ఓటర్ల సవరణ-2024కు సంబంధించి పెండింగ్ క్లెయిమ్స్‌ను పక్కాగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆదివారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎపిక్ కార్డులు పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా మాత్రమే పంపిణీ చేయాలన్నారు. సెక్టార్ అధికారులు నియామకంతోపాటు మైక్రోఅబ్జర్వర్ల జాబితా సిద్ధం చేయాలని కోరారు. సమావేశంలో తిరుపతి నగరపాలక కమిషనర్ హరిత, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ పెంచల కిషోర్, అడిషనల్ ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్ , ఆర్డీఓలు నిశాంత్ రెడ్డి , కిరణ్ కుమార్, చంద్రముని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే తిరుపతిలో ఐటీ కేంద్రం



పెన్షనర్లను సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి(అలిపిరి): యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తిరుపతిలోనే త్వరలో ఐటీ కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తిరుపతి రైల్వేకాలనీలో నిర్వహించిన పెన్షనర్స్ డే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అభినయ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక నగరాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా మాస్టర్ ప్లాన్‌తో 18 రోడ్లు నిర్మిస్తున్నామని వెల్లడించారు. పలు ప్రాంతాల్లో రహదారులను విస్తరించి, కళాకృతులను ఏర్పాటు చేశామన్నారు. సుమారు 110 ఎకరాల్లో ఐటీ కేంద్రం నెలకొల్పేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. అనంతరం పలువురు రైల్వే పెన్షనర్లను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, వసికుంట నారాయణ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు మునిరామిరెడ్డి, దినేష్‌రాయల్, రాజా, అశోక్‌కుమార్, మురళీయాదవ్, నాధముని, రాఘవులనాయుడు, ధనంజయులు పాల్గొన్నారు.

పంట కాలువలో యువతి మృతదేహం



మృతదేహం చేతిపై పచ్చబొట్టు

శ్రీకాళహస్తి: మండలంలోని మిట్టకండ్రిగ– తొండమనాడు రోడ్డులో పుల్లారెడ్డికండ్రిగ– అమ్మపాళెం క్రాస్ వద్ద పక్కన చుక్కల నిడిగల్లు చెరువుకు వెళ్లే పంట కాలువలో గుర్తు తెలియని యువతి (26) మృతదేహం ఆదివారం ఉదయం వెలుగు చూసింది. రూరల్ సీఐ అజయ్‌కుమార్ కథనం మేరకు.. కాలువలో గోతాలు, కొబ్బరి ఆకుల్లో కప్పేసిన మృతదేహాన్ని ఆ మార్గంలో వెళుతున్న వారు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతురాలి ఒంటిపై నెమలి బ్లూ రంగు పైజమా, మెరున్ కలర్ లెగ్గిన్ ఉన్నాయి. కుడి చేతికి పచ్చబొట్టు ఉంది. మృతురాలి వివరాలు తెలిసిన వారు రూరల్ పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే మళ్లీ రావాలి.. సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాలి.. బడుగుల బతుకుల్లో చిరునవ్వు కొనసాగాలి.. నిరుపేదల జీవితాల్లో సంతోషం కలకాలం నిలబడాలి.. రాజన్న రాజ్యం అప్రతిహతంగా ముందుకు వెళ్లాలి.. ఇదే లక్ష్యంతో ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు పదం కలుపుతున్నారు.. జగనన్నకు ప్రజల అండతోపాటు శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆశీస్సులు కావాలంటూ కదంతొక్కుతున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి కాలినడకన తిరుమలకు బయలుదేరారు. మహోన్నత ఆశయంతో సాగుతున్న పాదయాత్రికులకు ఎక్కడికక్కడ జనం అపూర్వ స్వాగతం పలుకుతున్నారు. వారి అడుగులో అడుగులు వేస్తున్నారు.

పదం కలుపుతూ..
కదం తొక్కుతూ..!

కుక్కలదొడ్డి వద్ద మహా పాదయాత్రలో ఆకేపాటి అమరనాథరెడ్డి



- జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని తిరుమలకు పాదయాత్రలు
- ఆకేపాటికి రేణిగుంటలో అపూర్వ స్వాగతం
- వెంకటగిరి చేరిన విజయనగరం ఎమ్మెల్సీ రఘురాజు
- చెన్నూరుకు చేరుకున్న అనకాపల్లి యువత

రేణిగుంట : వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి చేపట్టిన తిరుమల పాదయాత్ర ఆదివారం సాయంత్రం రేణిగుంట మండలం కుక్కలదొడ్డికి చేరింది. ఆయనకు స్థానికులు కర్పూర హారతులు పట్టి స్వాగతం పలికారు. ఆకేపాటి మాట్లాడుతూ సుమారు 21 ఏళ్లుగా అన్నమయ్య కాలిబాటలో తిరుమలకు వెళ్లి మొక్కులు తీర్చుకుంటున్నామన్నారు. ఈ క్రమంలోనే పాదయాత్ర చేపట్టామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని దేవదేవుని ప్రార్థిస్తామని వెల్లడించారు. ఆయన భక్తబృందంతో కలిసి కుక్కలదొడ్డి కేశవరెడ్డి స్కూల్ వద్ద రాత్రి బస చేశారు. సోమవారం ఉదయం శేషాచలం అడవుల గుండా తిరుమలకు చేరుకోనున్నారు. కార్యక్రమంలో ఆకేపాటి సాయిభరత్‌రెడ్డి, జ్యోతి, అనిల్‌రెడ్డి, కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, భాస్కర్‌రెడ్డి, న్యాక్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

వెంకటగిరి రూరల్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా కావాలని కోరుతూ విజయనగరం జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర ఆదివారం వెంకటగిరికి చేరింది. పట్టణంలోని తెలుగుగంగ అతిథి గృహంలో ఆయన మాట్లాడుతూ జగనన్న ఆకాంక్ష మేరకు రాష్ట్రంలో మొత్తం 175 స్థానాలు కైవసం చేసుకునేలా తిరుమల శ్రీవారు దీవెనలు అందించాలని కోరుతూ సుమారు 820 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. నవంబర్ 8వ తేదీన సుమారు 25 మందితో పాదయాత్ర ప్రారంభించామని, ఈనెల 21వ తేదీలోపు తిరుమలకు చేరుకుంటామని వెల్లడించారు. వెంకటగిరి నియోజకవర్గంలోకి ప్రవేశించినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఎనలేని సహకారం అందించారని కొనియాడారు.



చెన్నూరు నుంచి పాదయాత్ర ప్రారంభిస్తున్న గణేష్ తదితరులు

గూడూరురూరల్: జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ అనకాపల్లి జిల్లా రావికవతం మండలం, జెడ్ కొత్తపట్నం గ్రామానికి చెందిన వైఎస్సార్ అమరజ్యోతి స్టూడెంట్స్ అండ్ యూత్ ఫోర్స్ అధ్యక్షుడు గాలిగణేష్ తదితరులు తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ క్రమంలో శనివారం రాత్రి గూడూరు మండలం చెన్నూరుకు పాదయాత్ర చేరుకుంది. వైఎస్సార్‌సీపీ స్థానిక నేత శ్రీకిరెడ్డి శ్రీనివాసులురెడ్డి వారికి స్వాగతం పలికారు. సమీపంలోని శ్రీకటాలమ్మ ఆలయంలో వసతి ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం గాలి గణేష్ తదితరులు పాదయాత్ర ప్రారంభించారు.



వెంకటగిరి వద్ద పాదయాత్రలో ఎమ్మెల్సీ రఘురాజు, వైఎస్సార్‌సీపీ నేతలు

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం




ఈశ్వరయ్యనాయుడు మృతదేహం, ఈశ్వరయ్య (ఫైల్)

సైదాపురం : మండలంలోని మొలకలపూండ్లలో ఆదివారం విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన అడసనపల్లి ఈశ్వరయ్యనాయుడు (65) ఉదయం పొలం దున్నేందుకు ట్రాక్టర్‌పై బయలుదేరారు. దున్నుతున్న సమయంలో కిందకు వాలిన విద్యుత్ తీగలను సరిచేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. భార్య మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా వాసు తెలిపారు.

రెజ్లింగ్ జిల్లా జట్టు ఎంపిక



నాయుడుపేట గురుకులంలో తలపడుతున్న రెజ్లింగ్ క్రీడాకారులు

నాయుడుపేట: నాయుడుపేట బాలుర గురుకుల కళాశాల ప్రాంగణంలో ఆదివారం జిల్లా స్థాయి రెజ్లింగ్ జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సురేష్, కార్యదర్శి, కోచ్ బి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో రాణించాలంటే శిక్షణ ఉండాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. నిరంతర వ్యాయామంతో మానసిక ఉల్లాసం, ఏకాగ్రత కలుగుతాయని చెప్పారు. అనంతరం జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు జనవరి మొదటి వారంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొంటుందని వివరించారు. ఈ పోటీలకు నాయుడుపేట, తడ, సూళ్లూరుపేట, సత్యవేడు, గూడూరు, శ్రీకాళహస్తి, కోట, వాకాడు విద్యానగర్, తిరుపతి ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.మల్లికార్జునరావు, వైస్ ప్రెసిడెంట్ రవిరెడ్డి, కల్కి, సుధీర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ దార రవి, పీఈటీ భాస్కర్, పీడీ హరినారాయణ, ఉపాధ్యాయులు శేఖర్‌బాబు, వెంకటక్రిష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

పురుషుల ఫ్రీ స్టైల్ విభాగంలో 57 కేజీల్లో జె.హరి, 61 కేజీలలో వి.కుమార్, 65 కేజీల్లో ఆర్.రఘు, 70 కేజీల్లో డి.శ్రవంత్‌కుమార్, 74 కేజీల్లో ఎ.నాగరాజు, 79 కేజీల్లో బి.రాజేష్, 86 కేజీల్లో ఇ.దినేష్, 92 కేజీల్లో ఎన్.వినయ్, 97 కేజీల్లో ఎం.హర్ష, 125 కేజీల్లో ఎం.రమేష్ ఎంపికయ్యారు. పురుషుల గ్రీన్ రోమన్ విభాగంలో 63 కేజీల్లో ఎం.ప్రసాద్, 72 కేజీల్లో బి.హరిబాబు, 77 కేజీల్లో కె.సీతారాం, 82 కేజీల్లో డి.లీలామోహన్, 87 కేజీల్లో ఎన్.జ్యోతి ప్రకాష్, 97 కేజీల్లో కె.శశిధర్, మహిళల విభాగంలో 53 కేజీల్లో పి.పవిత్ర, 55 కేజీల్లో ఎన్.జ్యోతి, 56 కేజీల్లో పి.చందన, 57 కేజీల్లో పి.పావని, 62 కేజీల్లో ఎన్.లాస్య, 65 కేజీల్లో ఓఎస్.మౌనిక ఎంపికయ్యారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

ప్రియుడిని పిలిపించి...భర్తని చంపించింది!

- గోవిందు హత్యకు భార్యే కారణం?
- పోలీసుల అదుపులో నిందితులు?

తిరుపతి రూరల్: వెదురుకుప్పం మండలం, తిప్పినాయుడుపల్లికి చెందిన గోవిందు(30)ను కట్టుకున్న భార్యే తన ప్రియుడితో కలిసి చంపినట్లు తెలుస్తోంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో అసలు విషయాలు బయటకు వస్తున్నట్లు సమాచారం. వివరాలు.. సదుం మండలం, కామ్మివారిపల్లికి చెందిన యువతి మదనపల్లిలోని బీటీ కళాశాలలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. అదే కళాశాలలో తనతో పాటు ఫైనల్ ఇయర్ చదువుతున్న అంగళ్లకు చెందిన యువకుడితో ఆమె ప్రేమలో పడింది. ఈప్రేమ వ్యవహారం తెలిసే యువతి తల్లిదండ్రులు డిగ్రీ ఫైనల్ ఇయర్ పూర్తికాకుండానే వెదురుకుప్పం మండలం, తిప్పినాయుడుపల్లికి చెందిన గోవిందుతో గత ఆగస్టులో కాణిపాకంలో వివాహం చేశారు. ఈ క్రమంలో తిరుపతి రూరల్ మండలం, చిగురువాడ పంచాయతీ, వైఎస్సార్ కాలనీలో దంపతులు కాపురం పెట్టారు. పెళ్లి అయ్యి మూడు నెలలు అవుతున్నా ప్రియుడిని మరవలేని ఆమె తన ప్రేమకు అడ్డుగా ఉన్న భర్తను చంపేందుకు స్కెచ్ వేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం తన ప్రియుడిని అంగళ్ల నుంచి తిరుపతికి పిలిపించినట్లు సమాచారం. ప్రియుడితో కలిసి అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న గోవిందు గొంతు పిసికి చంపేశారు. అనంతరం అకస్మాత్తుగా చనిపోయినట్లు నాటకం ఆడింది. అంత్యక్రియల సమయంలో గోవిందు మృతదేహంపై గాయాలను గుర్తించిన బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హత్య విషయం బయటపడింది. పోస్టుమార్టం రిపోర్టులోనూ ఇది హత్యగానే నిర్ధారణైంది. దీంతో పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. తిరుపతి రూరల్ సీఐ సుబ్రమణ్యంరెడ్డి నిందితులను అదుపులోకి తీసుకుని తనదైన శైలిలో విచారిస్తున్నట్లు సమాచారం. ప్రియుడితో కలిసి తన భర్తను తానే హత్య చేసినట్లు మృతుడి భార్య ఒప్పుకున్నట్లు తెలుస్తోంది.

కబడ్డీ విజేత పుంగనూరు

- ద్వితీయ స్థానంలో తిరుపతి

పుంగనూరు: ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీల్లో విజేతగా పుంగనూరు జట్టు నిలించింది. రెండో స్థానాన్ని తిరుపతి జట్టు కైవసం చేసుకుంది. పట్టణంలోని బీఎంఎస్ క్లబ్‌లో రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. పట్టణానికి చెందిన రాష్ట్ర స్థాయి క్రీడాకారులు లోకేష్, యశోద కుమార్ జ్ఞాపకార్థం వారి మిత్ర బృందంచే ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో మొత్తం 24 జట్లు పాల్గొన్నాయి. పట్టణంలోని నక్కబండకు చెందిన రామకృష్ణ జట్టు, తిరుపతికి చెందిన దినేష్ జట్టు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఎముకలు కొరికే చలిగాలిలో కబడ్డీ పోటీలు ప్రేక్షకులకు ఉరకలెత్తించేలా చేసింది. చివరికి పుంగనూరు జట్టు విజేతగా నిలవడంతో తిరుపతి జట్టు రెండో స్థానంతో సరిపెట్టుకుంది. విజేత జట్టు రూ.50 వేలు నగదు, ట్రోఫీని అందుకున్నారు. తిరుపతికి చెందిన దినేష్ జట్టు రూ.30 వేలు నగదు గెలుచుకుంది. మూడవ స్థానంలో తిరుపతి జట్టు రూ.20 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన పుంగనూరు మండలం ఏడూరుకు చెందిన ఎర్రకోట జట్టు సభ్యులు రూ.10 వేలు గెలుచుకున్నారు. మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆవుల అమరేంద్ర, కో ఆప్షన్ సభ్యుడు తుంగామంజునాథ్ బహుమతులు పంపిణీ చేశారు. హాజరైన క్రీడాకారులకు భోజన, వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్‌క్లబ్ అధినేత కనకదుర్గా సత్యనారాయణ, జయకృష్ణ, నానబాల సురేష్, తుంగా మంజునాథ్, మహమ్మద్, నవయుగనాథ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ద్వితీయ బహుమతి అందుకుంటున్న దినేష్

కొండచిలువ హల్‌చల్

చంద్రగిరి: మండల పరిధిలోని కాశిపెంట్ల గ్రామంలో ఆదివారం భారీ కొండచిలువ హల్‌చల్ చేసింది. సమీప అటవీ ప్రాంతంలో నుంచి గ్రామంలోకి రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం గ్రామ పెద్దలు కొండచిలువను చాకచక్యంగా బంధించారు. అనంతరం గోనె సంచిలో వేసి, సమీప అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.



గ్రామంలోకి వచ్చిన కొండచిలువ

బస్సు ఢీకొని లారీ డ్రైవర్ మృతి

చంద్రగిరి : మండలంలోని తొండవాడ సమీపంలో పూతలపట్టు– నాయుడుపేట జాతీయ రహదారిపై ఆదివారం బస్సు ఢీకొని లారీ డ్రైవర్ మృతి చెందగా, క్లీనర్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. తమిళనాడుకు చెందిన లారీ చిత్తూరు వైపునకు వెళుతూ రోడ్డు పక్కన ఆగింది. డ్రైవర్ ఏలుమలై(31), క్లీనర్ వీరభద్రం కిందకు దిగి వెనుక టైర్లు పరిశీలిస్తుండగా, చిలకలూరిపేట నుంచి అయ్యప్ప భక్తులతో కాణిపాకం వస్తున్న ప్రైవేట్ బస్సు ఢీకొంది. దీంతో ఏలుమలై అక్కడికక్కడే మరణించాడు. క్షతగాత్రుడిని 108లో తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని సంజయ్‌గాంధీ కాలనీలో ఆదివారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. కాలనీకి చెందిన వేటగిరి చంద్రబాబు(26) మద్యానికి బానిసై పనీపాటా లేకుండా తిరిగేవాడు. ఈ క్రమంలో మద్యం తాగేందుకు భార్య సింధును డబ్బులు అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో పురుగుల మందు తాగేశాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన చంద్రబాబును వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా శ్రేయస్సే పరమావధిగా పాలన

భాకరాపేట : ప్రజా శ్రేయస్సే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నట్లు తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చిన్నగొట్టిగల్లు మండలంలోని ఎగవూరు, దిగవూరు, టి.చట్టివారిపాళెం, నెల్లుట్లవారిపల్లె పంచాయతీల్లో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా సచివాలయాల్లో సంక్షేమ బోర్డులు ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే నాయకుడు జగనన్న అని కొనియాడారు. భవిష్యత్ తరాలు అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిచ్చారని వెల్లడించారు. విప్లవాత్మకమై పథకాలతో పేద విద్యార్థులకు ఉన్నతికి పూర్తి సహకారం అందిస్తున్నారని వివరించారు. ప్రజారోగ్య రక్షణకు పెద్దపీట వేస్తూ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25లక్షలకు పెంచారని తెలిపారు. అవ్వాతాతలకు రూ.3వేలకు పింఛన్ పెంచిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. చిన్నగొట్టిగల్లు మండలంలోని ప్రతి పంచాయతీలో రూ.3కోట్లకు తగ్గకుండా అభివృద్ధి పనులు చేసినట్లు వెల్లడించారు. ప్రతి పల్లెను ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రత్యేకంగా రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం సచివాలయం, ఆర్‌బీకే, ఆరోగ్య కేంద్రం భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, సీడీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు స్వరూప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొండారెడ్డి, జేసీఎస్ అధ్యక్షుడు ఖదీర్‌అహ్మద్, డివిజన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, సర్పంచులు కుమారి, శంకర్‌రెడ్డి, ధనలక్ష్మి, శశిప్రియ, ఎంపీడీఓ దేవేంద్రబాబు, ఈఓపీఆర్‌డీ సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



నెల్లుట్లవారిపల్లెలో మాట్లాడుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

చిన్నగొట్టిగల్లు మండలం దిగవూరు పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు రెడ్డెప్పరెడ్డి, దీప్తి, రెడ్డెమ్మ, శేఖర్‌రెడ్డి, సదాశివరెడ్డి, సరోజ, నాగరాజా తదితరులకు మోహిత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన నేతలు మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వెల్లడించారు. అనంతరం మోహిత్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన నేతలతో మోహిత్‌రెడ్డి